సర్వీస్‌రోడ్లు నిర్మించేదెప్పుడు?


సిరిచెల్మ ఫ్లైఓవర్ వద్ద నిర్మించని సర్వీస్ రోడ్డు

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆయా గ్రామాల ప్రజలు
- తరుచుగా ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ: ప్రధాన 44వ జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారి పూర్తయి దాదాపుగా 15 సంవత్సరాలు అవుతున్నా.. సంబంధిత కాంట్రాక్టర్లు ప్రధాన కూడళ్ల, సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపట్టక పోవడంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని సిరిచెల్మ ఫ్లైఓవర్‌పై నుంచి దుబార్‌పేట్ ఫ్లైఓవర్ లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సాథ్‌నంబర్ గ్రామంలో ఒక వైపు సర్వీస్ రోడ్డు నిర్మించినా.. కాంట్రాక్టర్ మరో వైపు నిర్మించకుండా వదిలేశారు. గాంధీనగర్ వద్ద నిర్మించిన సర్వీస్ రోడ్డుపై మిషన్ భగీరథ పైపులైన్ వేయడానికి రోడ్డు మధ్యలో నుంచి పైపులైన్ వేశారు కానీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అవస్థలు పడుతున్నారు.

నత్తనడకన పనులు..

గుడిహత్నూర్ మండల కేంద్రంతో పాటుగా సీతాగొంది వద్ద నిర్మిస్తున్న సర్వీస్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దాదాపుగా సంవత్సర కాలం నుంచి పనులు కొనసాగుతుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలో రెండు వైపులా నిర్మిస్తున్న సర్వీస్ రోడ్డు పనులు గతేడాది నుంచి కొనసాగుతూ..నే ఉన్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా డొంగర్‌గావ్ నుంచి గుడిహత్నూర్ వరకు జాతీయ రహదారిపై వన్‌వే నిర్మించారు. రోడ్డు మధ్యలో స్టాప్‌లు ఏర్పాటు చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీస్‌రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి



మండల కేంద్రంలోని సిరిచెల్మ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించాలి. సర్వీస్ రోడ్డు నిర్మించక పోవడంతో సిరిచెల్మ వైపు నుంచి వచ్చే 50 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే రోడ్డు నిర్మించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– కళ్లెం ప్రవీణ్‌రెడ్డి, ఇచ్చోడ

పనుల్లో వేగం పెంచాలి



గుడిహత్నూర్ మండలంలో నిర్మిస్తున్న సర్వీస్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలి. గత ఏడాదిగా పనులు కొనసాగుతుండటంతో తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్న అధికారులకు పట్టింపు లేదు. పనుల్లో వేగం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దోణి అశోక్, గుడిహత్నూర్

లోలెవల్ వంతెనలతో ఇక్కట్లు

- చినుకు పడితే రాకపోకలు బంద్
- అత్యవసర సమయంలో ఇక అంతే


లోలెవల్ వంతెనపై నుంచి వరద ఉధృతి (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని కామాయి గ్రామానికి మూడు వైపులా పెన్‌గంగ ప్రవహిస్తోంది. దాదాపు గ్రామంలో 600 మంది జనాభా ఉన్నారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు వివిధ పనుల నిమిత్తం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. అయితే వాగుపై హై లెవెల్ వంతెన లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చి చేరగానే వాగు ఉప్పొంగి రాకపోకలు నిలిచిపోతాయి. చిన్నపాటి చినుకు పడినా.. లోలెవల్ వంతెన పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. అత్యవసర సమయంలో రోగులను ఆసుపత్రికి తరలించడంలో కష్టంగా మారుతోంది. సంవత్సరాలుగా హైలెవెల్ వంతెన నిర్మించాలంటూ కోరుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వర్షాలు కురిసినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రజలు ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన పరిస్థితి నెలకొంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో అంగన్‌వాడీ

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలంలోని డిగ్నూర్ అంగన్‌వాడీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గత 30 ఏళ్ల కింద నిర్మించిన భవనం కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతిన్నాయి. ఫ్లోరింగ్ పెద్దపెద్ద గుంతలు ఏర్పడి పిల్లలకు సైతం కూర్చోలేని పరిస్థితి. ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి


చీరలు పంపిణీ చేస్తున్న సభ్యులు

భీంపూర్: ప్రతిఒక్కరూ సామాజిక దృక్పథం అలవర్చుకోవాలని ఎస్వీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిడాం వామన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని సెంటర్ సాంగ్వి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఆదివారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆదివాసీలు అభివృద్ధి వైపు పయనించాలంటే విద్య, వైద్యం ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. ఆదివాసీ సమాజ మనుగడకు సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంచిర్యాల జిల్లా మేనేజర్ శ్రీకళ శ్రీనివాస్, రిటైర్డు ఉపాధ్యాయురాలు సుమిత్ర, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సింధు, ఉపాధ్యక్షులు భీమ్ రావ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం ఎంఐఎం కార్యవర్గాన్ని ఎంఐఎం ఆదిలాబాద్ టౌన్ ప్రెసిడెంట్ నజీన్ హైమద్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షేక్ జావిద్, జనరల్ సెక్రటరీగా షేక్ సజీద్, ట్రెజరర్‌గా సుఫియాన్, జాయింట్ సెక్రటరీలుగా షేక్ ఆర్షద్, షేక్ ఆథర్, అఫ్రోజ్, సదీఖ్‌లను ఎన్నుకున్నారు. మండలంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు.

మాదిగ కుల కమిటీ..

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆదివారం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మాదిగ కుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దుబాక అశోక్, ఉపాధ్యక్షుడిగా అన్నెల లక్ష్మణ్, కొల్లూరి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా సిరిసిల్ల భూమయ్య, కోశాధికారిగా జల్లి దుర్గయ్య, కొత్తూరి లక్ష్మణ్, కార్యదర్శిగా మచ్చ అజయ్, సహాయ కార్యదర్శిగా కాశిపాక విష్ణు, సభ్యులుగా దేవునిరి అడేల్లు, మడుగు శివ, దవురాజు, ముడుగు శీను అరపెల్లి రవి, చిట్టి రవిలను ఎన్నుకున్నారు.

బీసీ రిజర్వేషన్ పోరాట సమితి..

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బీసీ రిజర్వేషన్ పోరాట సమితి కార్యవర్గాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా సీపతి లింగాగౌడ్, కోకన్వీనర్‌గా కందుకూరి రమేశ్, సభ్యులుగా తోట సత్తన్న, ఒల్లెపు భుజంగరావు, సాడిగా రాజేశ్వర్, బింగి వెంకటేశ్, కట్టా లక్ష్మణ చారి, షికారి శ్రీనివాస్, ఘర్షకుర్తి వెంకటేశ్, బొడ్డు కిరణ్, రామగిరి శ్రీనివాస్, ఆరేపల్లి రాజన్న, కలువ రవి, నాగుల రాజేశ్వర్, సూర్యకాంత్ యాదవ్, సల్గర్ రవీందర్‌లను ఎన్నుకున్నారు.

జగిత్యాలకు బస్సు ప్రారంభం

ఉట్నూర్‌రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఉట్నూర్ నుంచి జగిత్యాలకు బస్సు సర్వీసు ప్రారంభించారు. ఉదయం ఉట్నూర్ నుంచి 9.15 గంటలకు బయలుదేరుతుందని మళ్లీ తిరుగు ప్రయాణంలో జగిత్యాల నుంచి సాయంత్రం 4గంటలకు బయలుదేరుతుందని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ

బేల: మండలంలోని పాటన్ గ్రామంలో ఆదివారం ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఓటుచోరీతో ప్రజాస్వామ్యానికి భంగం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దోటే అనిల్, గేడాం గులాబ్, నారాయణ్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

నేరడిగొండ: పేదల ఆకలి తీర్చడమే తమ లక్ష్యమని రీవర్స్ ఆఫ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఆనే అన్నారు. సర్వీస్ ఆఫ్ అన్‌కండీషనల్ లవ్ ప్రాజెక్ట్‌లో భాగంగా మొదటి ఆకలి తీర్చే కేంద్రాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. కార్యక్రమంలో సమత రిబ్కా, డాక్టర్ ఎస్.తిమోతి, బ్రదర్ అమృతరావు, బ్రదర్ రాజు, సువర్ణ, దివ్య పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: వృద్ధాశ్రమం పేరిట ఇంటింటికీ తిరుగుతూ డబ్బులు వసూలు చేస్తున్న నిజామాబాద్ జిల్లా గొల్లకుంటతండాకు చెందిన ముత్యాలు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో చిందం గంగాధర్ ఇంటికి ఆటోలో వచ్చి ఓల్డేజ్‌హోమ్ కోసం డబ్బులు, బియ్యం, ఇతర వస్తువులు ఇవ్వాలని కోరగా, ఆయన ఆటోపై ఉన్న ఫోన్‌పే నంబర్ ఫేక్ అని తేలింది. ఓల్డేజ్ హోమ్ పేరిట ప్రజలను మోసం చేస్తున్నాడని గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

హాజరు అంతంతే..


భోజనం చేస్తున్న విద్యార్థులు

- ఆశ్రమ పాఠశాలలో అమలుకు నోచుకోని ఎఫ్ఆర్ సిస్టం
- మూలనపడిన యంత్రాలు

ఆదిలాబాద్‌రూరల్: దసరా సెలువుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా.. ఆదిలాబాద్ ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో ఇంకా పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరు కానీ పరిస్థితి కనిపిస్తోంది. ఆదిలాబాద్ ఏటీడీవో పరిధిలో 14 ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. అయితే ప్రతీ రోజు ఆయా ఆశ్రమ పాఠశాలలకు చెందిన హెచ్ఎం, వార్డెన్‌లు ప్రతీ రోజు మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంటలోపు వారి పరిధిలోని ఏటీడీవో కార్యాలయాలకు విద్యార్థుల హాజరు శాతాన్ని పంపిస్తారు. ఆ కార్యాలయాల ఉద్యోగులు వారి హాజరు శాతాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఉన్నతాధికారులకు అందజేస్తారు. ఇదిలా ఉండగా.. ఏటీడీవో పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో 3,575 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దసరా సెలవులు ముగిసి వారం రోజులవుతున్న ఇంకా జిల్లాలోని సగానికిపైగా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు 50 శాతం మంది విద్యార్థులు వసతి గృహాలకు రాలేని పరిస్థితి ఉంది.

కొన్ని రోజులు మాత్రమే అమలు..

గత విద్యా సంవత్సరం ఆయా ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదు కోసం ఫేస్ రిక్వాగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్)ను ప్రవేశపెట్టారు. ఇది కేవలం కొన్ని రోజులు మాత్రమే అమలు చేశారు. ఈ విద్యా సంవత్సరమైతే దాని ఊసే లేకపోవడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇలా జరుగుతుందని పలు గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వసతి గృహాలను తనిఖీ చేసి విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

50 శాతానికిపైగా హాజరు

ఆదిలాబాద్ ఏటీడీవో పరిధిలో 14 ఆశ్రమ పాఠశాలలు ఉండగా దసరా సెలువు అనంతరం చాలా ఆశ్రమ పాఠశాలలో 50 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మరో రెండు రోజులైతే పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరవుతారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు చెబుతున్నారు.

– నిహారిక, ఆదిలాబాద్

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


ప్రతిష్ఠించిన బైరందేవ్ విగ్రహం

బేల: మండలంలోని సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులోని బైరందేవ్ ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బైరందేవ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠాపన, హోమపూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, సిడాం కుషాల్‌రావు, కొడపే అరుణ్, పెందుర్ రాందాస్, ఆడ శంకర్, కొడప భీంరావు, సలాం దేవ్‌రావు పాల్గొన్నారు.

ప్రముఖుల పూజలు..

నూతన బైరందేవ్ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయంలో పలువురు ప్రముఖులు వేర్వేరుగా పూజలు చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, జిల్లా సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి పూజలు చేశారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి


భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

నార్నూర్: ఆదివాసీల హక్కుల సాధన కోసం విరోచిత పోరాటం చేసిన కుమురం భీం ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించారు. మాన్కాపూర్ గ్రామస్తులు కాలినడకన కుమురం భీం భవన్‌కు చేరుకొని, జెండా ఆవిష్కరించారు. అనంతరం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్లాలంటే చదువు ఒకటే మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు బానోత్ గజానంద్ నాయక్, అడే సురేశ్, మాడవి మాన్కు, ఆత్రం పరమేశ్వర్, పూసం ఈస్రు, ఆర్కా గోవింద్, ఎత్మారావు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

భీంపూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కరంజి, గిర్గాం, ధనోర గ్రామాల్లో గర్భిణులకు రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ గర్భకోశ వైద్య నిపుణులు డా. విజయసారథి శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తల్లి, బిడ్డ సురక్షిత కాన్పులకోసం మాతా శిశు సంరక్షణ రికార్డులో నమోదు చేసిన ఆసుపత్రులకు వెళ్లాలని సూచించారు. తాజా ఆకుకూరలు, సంపూర్ణ పోషకాహార ప్రాధాన్యత, సకాలంలో పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, మేఘ, రోహిదాస్, సంధ్యారాణి, మాయావతి, సాహితి, సరస్వతి, లచ్చుబాయ్, సుజాత, విష్ణుకుమార్, ప్రయోగ శాల నిపుణులు శ్రీలత, సిబ్బంది రేఖ, అశోక్, శంకర్, 102 సిబ్బంది పురుషోత్తం, లఖాన్

యువత రక్తదానానికి ముందుకు రావాలి


రక్తదాతలను అభినందిస్తున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: యువత రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలువాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణానికి చెందిన స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణకుమార్‌తో పాటు ఆయన స్నేహితులు రిమ్స్ రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. వారిని డైరెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అరుణ్ రెడ్డి, రాజు, సాగర్, రిమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

‘అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు’


ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఆడే గజేందర్

తాంసి: అర్హులైన ప్రతిఒకరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కప్పర్లలో నాయకులతో కలిసి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బిల్లుల వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓటుచోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ, సంతోశ్, గంద్రత్ అరుణ్, లింగారెడ్డి, కృష్ణారెడ్డి, పోతారెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

ఓటు చోరీతోనే బీజేపీకి అధికారం

నేరడిగొండ: ఓటు చోరీ ద్వారానే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఓటు సంతకాల సేకరణ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థను పక్కదోవ పట్టించి, ఓటు చోరీ పద్ధతులతో అధికారాన్ని దక్కించుకుందని విమర్శించారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం దెబ్బతింటోందని, ప్రజల హక్కులను హరిస్తున్న రాజకీయాలను ఇక సహించబోమని స్పష్టం చేశారు.

దండారీ ఉత్సవాలు ప్రారంభం


గుస్సాడీలకు పూజలు చేస్తున్న ఆదివాసీలు

నేరడిగొండ: మండలంలోని ఆదివాసీ గూడెల్లో ఆదివారం దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గుత్తాల, రోల్‌మామడ, లింగట్ల, ఆరేపల్లి, వాగ్దారి, మాదాపూర్, చించోలి, బంధంరేగడి తదితర ఆదివాసీ గూడెల్లో గుస్సాడీలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకలను దీపావళి వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దీంతో ఆదివాసీ గూడెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

నిర్వహణ గాలికి..


కళావిహీనంగా పల్లెప్రకృతి వనం

నేరడిగొండ: నేరడిగొండలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం నిర్వహణ లేక అధ్వానంగా మారుతోంది. ఒకప్పుడు సందర్శకులతో సందడిగా కనిపించిన వనం ఇప్పుడు నిర్జీవంగా మారింది. గడ్డి, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

పనిచేయని మొబైల్ టవర్



సాత్నాల: మండలంలోని మెడిగూడ(ఆర్) గ్రామంలో వారం రోజులుగా, జియో సిగ్నల్స్ రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. టవర్ల పని తీరు సరిగా లేకపోవడంతో ఆన్‌లైన్ సేవలు నిలిచిపోతున్నాయి. రైతులు ప్రభుత్వ పథకాల వివరాలు తెలుసుకోవడంలో సవాళ్లు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయంలో ఫోన్ కాల్ చేయలేని పరిస్థితి నెలకొడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత మొబైల్ కంపెనీ అధికారులకు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. మొబైల్ టవర్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆకట్టుకున్న నృత్యం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో వాల్మీకి విరచిత సంపూర్ణ శ్రీమద్రామాయణ ప్రవచన జ్ఞానయజ్ఞం జరుగుతోంది. ఈనెల 8న ప్రారంభమైన కార్యక్రమం 18 వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా నృత్యభూమి నాట్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం కూచిపుడి నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. నృత్య శిక్షకురాలు స్వప్నతో పాటు ఆమె శిష్యులు తనిష్క, కనిష్క, ప్రజ్ఞ, చైత్ర చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

పెన్‌గంగ కాలువ పరిశీలన


పరిశీలిస్తున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: మండలంలోని పోహర్, తెలంగ్‌రావు గూడ రెవెన్యూ గ్రామాల మధ్యన గత నెలలో భారీ వర్షాలకు కోతకు గురైన పెన్‌గంగ కాలువను ఆదివారం రైతులతో కలిసి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50మీటర్ల మేర కాలువ కోతకు గురై, నీరంతా వృథాగా పోతుందన్నారు. మరమ్మతులు చేయించకపోతే, రబీ పంటల సాగుకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, మరమ్మతులు చేయిస్తానని తెలిపారు.